

సోమశిలలో 24.324 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారం సాయంత్రానికి 24.324 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయం నుంచి వ్యవసాయానికి 3180 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.64,800
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,819
3శాతం జీఎస్టీతో	రూ.5,994
సవర (8గ్రా)	రూ.47,952

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.5 /23.5

సోమవారం గాలిలో తేమ 68 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు సాధారణ స్థితికి చేరుతున్నాయి. మంగళవారం ఎలాంటి మార్పులు ఉండబోవని వాతావరణ శాఖ తెలిపింది.

పల్లెవించిన వైద్యసేవలు

రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి పెద్దపీట వేస్తోంది. అందులో భాగంగా గ్రామ సచివాలయాలకు అనుబంధంగా విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసింది. అన్ని రకాల సౌకర్యాలను కల్పించి గ్రామీణ ప్రాంత ప్రజల చెంతకు వైద్యసేవలను తీసుకొచ్చింది. మరోవైపు ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల ద్వారా ఇంటి ముంగిటే స్పెషలిస్ట్ డాక్టర్స్‌తో మెరుగైన వైద్యసేవలను అందిస్తోంది.

ఊరూరా వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్స్

- అందుబాటులో టెలిమెడిసిన్ సేవలు
- వరంలా మారిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు
- ఎంఎల్‌హెచ్‌పీలకు అత్యవసర చికిత్సపై ప్రత్యేక శిక్షణ



జగనన్న ఆరోగ్యసురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య(ఫైల్)

కోవూరు: డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్స్ గ్రామీణ ప్రాంత ప్రజలకు వరంలా మారాయి. ఎలాంటి చిన్నఆరోగ్య సమస్య తలెత్తినా అక్కడికి వెళ్లి ఉచితంగా పరీక్షలు చేయించుకోవడంతో పాటు తగిన వైద్యం పొందుతున్నారు. దీర్ఘకాలిక వ్యాధులైన మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులకు తరచూ పరీక్షలు చేయించుకునేందుకు హెల్త్‌క్లినిక్స్ అనుకూలంగా ఉన్నాయి. గర్భిణులు, బాలింతలకు అవసరమైన పరీక్షలు, పిల్లల టీకాలకు ఇవి వేదికగా మారాయి. ఈ కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది. దీంతో అక్కడ పనిచేసే మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లు తమ వద్దకు వచ్చే వారికి అవసరమైన సేవలు అందిస్తున్నారు.

జిల్లాలో 497 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు

జిల్లాలో ప్రతి గ్రామ సచివాలయానికి అనుబంధంగా వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేశారు. జిల్లాలో 497 హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. వాటిలో మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్‌తో పాటు ఏఎన్ఎం, ఆశావర్కర్, హెల్త్‌అసిస్టెంట్ అందుబాటులో ఉంటున్నారు. ఈ కేంద్రాల్లో 12 రకాల వైద్య సేవలు అందిస్తున్నారు. 14 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. 105 రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. దీంతో అనారోగ్యంతో వచ్చిన వారిని పరీక్షించి అవసరమైతే టెలిమెడిసిన్ విధానం ద్వారా వైద్యుడితో మాట్లాడిస్తున్నారు. అత్యవసర పరిస్థితి అయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఏరియా ఆస్పత్రి, బోధనా ఆస్పత్రులకు వెళ్లాలని సిఫార్సు చేస్తున్నారు. మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారికి హెల్త్ క్లినిక్‌లు సంజీవినిలా మారాయి.



గుమ్మళ్లదిబ్బలోని వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ భవనం

సేవలు ఇలా..

విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు వచ్చే రోగులకు అక్కడి సిబ్బంది పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేస్తారు. జాతీయ, రాష్ట్ర ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు అవసరమైన పరీక్షలు, వైద్య సేవలు సకాలంలో అందేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు. హెల్త్ క్లినిక్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను సందర్శిస్తూ అక్కడ అనారోగ్యం, రక్తహీనత, ఎదుగుదల లోపం ఉన్న చిన్నారులను గుర్తించి వైద్యం అందేలా చూస్తారు. హెల్త్ క్లినిక్ పరిధిలోని మంచినీటి సరఫరా వ్యవస్థను పర్యవేక్షిస్తూ క్లోరినేషన్ చేపడుతున్నారు. తమ పరిధిలో పారిశుద్ధ్యం, దోమల నివారణకు కృషి చేస్తున్నారు. ప్రతి బుధ, శనివారం ఇమ్యూనైజేషన్ ప్రోగ్రాం నిర్వహిస్తారు. ఇక్కడి ఎంఎల్‌హెచ్‌పీలకు అత్యవసర వైద్యం, బేసిక్ లైఫ్‌సపోర్టు విధానాలపై ఇటీవల శిక్షణ ఇచ్చారు. పాముకాటుతో వస్తే ఏమి చేయాలి.. పాయిజన్ కేసులు వస్తే ఎలా వ్యవహరించాలి.. గుండె ఆగినప్పుడు సీపీఆర్ ఎలా చేయాలి అనే అంశాలపై ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు.

వరంలా జగనన్న ఆరోగ్య సురక్ష

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాలు గ్రామీణులకు వరంలా మారాయి. ప్రతి విలేజ్ హెల్త్ క్లినిక్ పరిధిలో వారంలో రెండ్రోజులు ఫ్యామిలీ డాక్టర్ క్యాంపులు, స్పెషలిస్ట్ వైద్యులతో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహిస్తున్నారు. మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారితో పాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యులు అనారోగ్యంతో మంచంతో ఉన్న వారి వద్దకు వెళ్లి పరీక్షించి అవసరమైన మందులు ఉచితంగా అందజేస్తున్నారు.

గ్రామంలోనే సేవలు అందుతున్నాయి



మా గ్రామంలో ఏర్పాటు చేసిన విలేజ్ హెల్త్ క్లినిక్ ద్వారా అన్ని రకాల వైద్యసేవలు అందుతున్నాయి. ఇక్కడే టీకాలు వేస్తున్నారు. బీపీ, షుగర్ పరీక్షలు కూడా చేస్తున్నారు. వైద్యులు వచ్చి పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారు. గతంలో వైద్యం పొందాలంటే చాలా దూరం వెళ్లాల్సి వచ్చేది ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. గ్రామంలోనే వైద్య సేవలు అందుతున్నాయి.

–ఎస్ అవినాష్, కోవూరు

ప్రతిష్టాత్మకంగా వైద్య సేవలు

జిల్లాలోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో వైద్య సేవలను ప్రతిష్టాత్మకంగా అందిస్తున్నాం. అత్యవసర ప్రాథమిక చికిత్సలపై ఎంఎల్‌హెచ్‌పీలకు శిక్షణ సైతం అందించాం. పాముకాటు, పాయిజన్ వంటి కేసులకు ప్రథమ చికిత్సలపై అవగాహన కల్పించాం. కార్డియోపల్మనరీ రీసిటేసన్ (సీపీఆర్)పై శిక్షణ ఇచ్చాం. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల ద్వారా గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం.

– డాక్టర్ పెంచలయ్య, డీఎంహెచ్‌ఓ, నెల్లూరు

న్యూస్‌రీల్

జెడ్పీ సీఈఓ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన కన్నమనాయుడు

నెల్లూరు (పొగతోట): జిల్లా పరిషత్ సీఈఓగా కన్నమనాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నేపథ్యంలో పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో డీడీగా పని చేస్తున్న ఆయన్ని నెల్లూరు జెడ్పీ సీఈఓగా బదిలీ చేశారు. ప్రస్తుతం సీఈఓగా పనిచేస్తున్న బీ చిరంజీవి డిప్యూటీ సీఈఓగా కొనసాగనున్నారు. నూతన సీఈఓను పీఆర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు.

నేర నియంత్రణకు చర్యలు



నెల్లూరు రైల్వే డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన విజయభాస్కర్‌రావు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు రైల్వే డీఎస్పీగా సీ విజయభాస్కర్‌రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన డీఎస్పీల బదిలీల్లో భాగంగా డీజీపీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న ఆయన నెల్లూరు రైల్వే డీఎస్పీగా నియమితులయ్యారు. నూతన రైల్వే డీఎస్పీకి నెల్లూరు, ఒంగోలు సీఐలు కే భుజంగరావు, ఎస్ శ్రీకాంత్‌బాబు, చీరాల, కావలి, నెల్లూరు, గూడూరు ఎస్సైలు సీహెచ్ కొండయ్య, టీ అరుణకుమారి, ఎస్ హరిచందన, జీ మాలకొండయ్య, ఎన్ కొండపనాయుడు, డీఎస్పీ కార్యాలయ సిబ్బంది పీవీ సురేష్ బాబు, ఆనంద్, తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విజయభాస్కర్‌రావు మాట్లాడుతూ పాత నేరస్తుల కదలికలపై నిఘా పెంచడంతో పాటు బీట్ వ్యవస్థను పటిష్టం చేసి రైళ్లలో నేరాలను కట్టడిచేస్తామన్నారు.

ఇందుకూరుపేట బ్యాంక్ అభివృద్ధికి కృషి



నూతన చైర్మన్ సురేష్‌రెడ్డిని సన్మానిస్తున్న ఏపీఎల్‌డీఏ చైర్మన్ విజయ్‌కుమార్

ఇందుకూరుపేట: ఇందుకూరుపేట కోఆపరేటివ్ అగ్రికల్చరల్ సొసైటీ (రూరల్ బ్యాంక్) చైర్మన్‌గా గునుపాటి సురేష్‌రెడ్డి, సభ్యులుగా సంగం వెంకయ్య, సీహెచ్ కృష్ణప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బ్యాంక్ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో చైర్మన్ మాట్లాడారు. బ్యాంకు అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. రైతుల కోసం వేబ్రిడ్జి నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, జెడ్పీ వైస్ చైర్మన్ శ్రీహరికోట జయలక్ష్మి, ఉడతా వెంకట శేషయ్య, గురజాల బుజ్జిబాబు పాల్గొన్నారు.

98.79 శాతం మందికి పింఛన్ కానుక

నెల్లూరు (పొగతోట) : వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా సోమవారంతో పూర్తయింది. ఐదు రోజుల్లో 98.79 శాతం మందికి వలంటీర్లు నగదు అందజేశారు.

పథకాలు సద్వినియోగం చేసుకోండి

నెల్లూరు(బారకాసు): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు సూచించారు. 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర'లో భాగంగా నగరంలోని వెంకటేశ్వరపురం, బోడిగాడితోట లోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల వద్ద సోమవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆధార్ అప్డేట్, పీఎం స్వనిధి పథకం, ముద్రలోన్, బ్యాంకుల ద్వారా అందుబాటులో ఉన్న రుణ సదుపాయాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. 5వ డివిజన్ కార్పొరేటర్ ఓబిలి రవిచంద్ర, బీజేపీ నాయకులు సురేంద్రరెడ్డి, రాజేశ్వరమ్మ పాల్గొన్నారు.

జిల్లాలో పది పోలింగ్ కేంద్రాలు మార్పు

- కలెక్టర్ ఎం హరినారాయణన్



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): ఓటర్ల సౌకర్యార్థం జిల్లాలోని 10 పోలింగ్ కేంద్రాలను మార్పు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ ఎం హరినారాయణన్ తెలిపారు. సోమవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిథిలమైన భవనాల్లో ఉన్న ఆత్మకూరు నియోజకవర్గంలోని రెండు, నెల్లూరురూరల్‌లోని రెండు, సర్వేపల్లిలోని మూడు, ఉదయగిరిలోని రెండు, కోవూరులోని ఒక పోలింగ్ కేంద్రాన్ని సమీపంలోని ప్రభుత్వ భవనాల్లోకి మార్పు చేసేందుకు ప్రతిపాదించామని వివరించారు. ఇందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ అంగీకారం తెలిపారు. అలాగే ఆత్మకూరు నియోజకవర్గంలోని నాలుగు పోలింగ్ కేంద్రాలు, ఉదయగిరి నియోజకవర్గంలోని ఒక పోలింగ్ కేంద్రం పేర్లు మార్చేందుకు ప్రతిపాదించినట్లు కలెక్టర్ చెప్పారు. కొన్ని రాజకీయ పార్టీలు పోలింగ్ ఏజెంట్లను నియామకం చేశాయని, మిగిలిన పార్టీలు కూడా పూర్తిస్థాయిలో ఏజెంట్లను నియమించుకోవాలని సూచించారు. తుది ఓటర్ల జాబితాకు సంబంధించి వస్తున్న ఫిర్యాదులను భారత ఎన్నికల సంఘం నియమ నిబంధనల మేరకు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫారం–6, 7, 8 దరఖాస్తులను త్వరగా పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అన్ని నియోజకవర్గాల్లో ఈఆర్వోలు, ఎన్నికల సిబ్బంది అందుబాటులో ఉండి దరఖాస్తులను పరిష్కరిస్తున్నారని వివరించారు. ఈ సమావేశంలో డీఆర్వో లవన్న, ట్రెయినీ కలెక్టర్ సంజనాసిన్హా, రాజకీయ పార్టీల ప్రతినిధులు వై మురళీధర్‌రెడ్డి, సురేంద్ర బాబు, ఎస్‌కే రసూల్, జలదంకి సుధాకర్, శివకుమార్, బీ శ్రీనివాసులు, బాలసుధాకర్, శ్రీరాం పాల్గొన్నారు.

కావలి కాలువ నీటి విడుదలకు సీఎం అనుమతి

- మేకపాటి వినతికి స్పందించిన సీఎంఓ కార్యాలయం



తాడేపల్లిలోని సీఎం కార్యాలయం వద్ద మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: జలదంకి మండలంలోని రైతుల పంటలు కాపాడేందుకు సోమశిల జలాశయం నుంచి కావలి కాలువ ద్వారా 1.5 టీఎంసీల నీటి విడుదలకు సీఎంఓ కార్యాలయం అనుమతి ఇచ్చినట్లు ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన తాడేపల్లిలోని సీఎంఓలో స్పెషల్ సెక్రటరీ ధనుంజయరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కలిసి సాగునీటి సమస్య తీవ్రతను వివరించారు. దీంతో ధనుంజయరెడ్డి ఇరిగేషన్ అధికారులు, జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి వెంటనే 1.5 టీఎంసీలను సోమశిల జలాశయం నుంచి కావలి కాలువకు విడుదల చేయాలని సూచించారు. అంతకుముందు 3 టీఎంసీల విడుదలకు జిల్లా అధికారులు అనుమతి ఇచ్చారు. కావలి కాలువకు మొత్తం 4.5 టీఎంసీలను విడుదల చేయనున్నారు. ఈ నీరు జలదంకి మండలంలో సాగులో ఉన్న 15 వేల ఎకరాలను కాపాడనుంది. దీంతో జలదంకి మండల రైతులు మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఉదయగిరి నియోజకవర్గంలోని జగనన్న లేఅవుట్ల అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.13 కోట్ల బిల్లులు పదిరోజుల్లో విడుదల చేసేలా సీఎం కార్యాలయం నుంచి రాజగోపాల్‌రెడ్డి హామీ తీసుకున్నారు. సీఎంఓలో ధనుంజయరెడ్డిని కలిసిన వారిలో ఉదయగిరి నియోజకవర్గ నాయకులు పాలవెల్లి మాలకొండారెడ్డి, బీ జయసింహారెడ్డి, తదితరులు ఉన్నారు.

పంచాయతీలకు ఆర్థిక దన్ను

- 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల
- జిల్లాకు రూ.49.30 కోట్లు మంజూరు
- సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి అవకాశం
- అభివృద్ధి ప్రణాళికల ఆధారంగా పనులు
- మరో రెండు నెలల్లో రూ.50 కోట్ల వరకు విడుదలయ్యే అవకాశం



ఉదయగిరి పంచాయతీ కార్యాలయం

ఉదయగిరి: పంచాయతీలకు ఆర్థిక దన్ను కల్పించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది. గత ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి కారణంగా అభివృద్ధికి నోచుకోని పల్లెల రూపురేఖలు నేడు జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలతో మారుతున్నాయి. ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు అందుబాటులోకి రావడంతో గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టే అవకాశం వచ్చింది. గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు ఎన్నికై మూడేళ్లు పూర్తికావస్తోంది. జిల్లాలోని పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.49.30 కోట్లు విడుదలయ్యాయి. 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన జిల్లాలోని పంచాయతీల ఖాతాల్లో నేరుగా సబ్‌ట్రెజరీల ద్వారా ఈ నిధులు సర్దుబాటు చేయడం జరుగుతుంది. ఈ నిధులను సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలతో పాటు పారిశుద్ధ్య పనులు, వివిధ రకాల చార్జీల చెల్లింపులు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ, వీధిలైట్లు, తాగునీటి సరఫరా, సిబ్బంది జీతభత్యాలు, తదితరాలకు వాడుకోవచ్చు. జిల్లాలో 757 గ్రామ పంచాయతీలు ఉండగా, వివిధ కారణాలతో నాలుగు పంచాయతీలకు ఎన్నికలు జరగలేదు. మిగిలిన అన్ని పంచాయతీల ఖాతాల్లో 15వ ఆర్థిక సంఘం నిధులు జమయ్యాయి. 2023–24 ఆర్థిక సంవత్సరం రెండు విడతలకు సంబంధించి ప్రభుత్వం ఈ నిధులు మంజూరుచేసింది. వచ్చే రెండు నెలల్లో జిల్లాలోని అన్ని పంచాయతీలకు మరో రూ.50 కోట్ల మేర నిధులు మంజూరయ్యే అవకాశం ఉందని జిల్లా పంచాయతీ కార్యాలయ అధికారులు చెబుతున్నారు. ఈ నిధులు అందుబాటులోకి వస్తే పంచాయతీల్లో అభివృద్ధి పనులు వేగం పుంజుకునే అవకాశం ఉంది. ఇప్పటికే గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా విడుదలైన నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులతోనూ అభివృద్ధి పనులు చేపడుతున్నారు.



వింజమూరులో డ్రైనేజీ నిర్మాణ పనులు

నిధులు సక్రమంగా ఖర్చు చేయాలి



గ్రామ పంచాయతీలకు మంజూరైన 15వ ఆర్థిక సంఘం నిధులను మార్గదర్శకాల ప్రకారం ఖర్చు చేయాల్సి ఉంది. ప్రస్తుతం విడుదలైన నిధులతో రోడ్లు, కాలువల నిర్మాణాలు, పారిశుద్ధ్య పనులు చేపట్టవచ్చు. నిధుల వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చాం. రానున్న రోజుల్లో 15వ ఆర్థిక సంఘం ద్వారా మరికొన్ని నిధులు అందుబాటులోకి రానున్నాయి.

–సుస్మితారెడ్డి, డీపీఓ

కలెక్టరేట్‌లో సేంద్రియ కూరగాయల విక్రయం



సేంద్రియ కూరగాయలను పరిశీలిస్తున్న అధికారులు

నెల్లూరు(దర్గామిట్ట): కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం సేంద్రియ కూరగాయలను విక్రయించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పీడీ సాంబశివారెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సేంద్రియ కూరగాయల స్టాళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం జరిగే స్పందనకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వస్తుంటారని, వీరందరికి ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన నాణ్యమైన కూరగాయలను విక్రయించాలనే ఉద్దేశంతో జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో స్టాళ్లను ప్రారంభించినట్లు తెలిపారు. సేంద్రియ కూరగాయల విక్రయం ద్వారా ప్రజల్లో సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కలుగుతుందన్నారు. పొదుపు మహిళలు ఈ వ్యాపారాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు.







శ్రమయే ఆరోగ్య ఫలే

ప్రజలకు ఆరోగ్యంపై క్రమేణా అవగాహన కలుగుతోంది. శారీరక శ్రమ లేకపోతే అనేక రోగాలు మనిషిని చుట్టుముడతాయని వివిధ పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో నగరాల్లో ఉండే వారు నడక, క్రీడలు, సైక్లింగ్ వంటి వాటికి ప్రాధాన్యం ఇస్తున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం సమయాల్లో తమ వీలును బట్టి కొంత సమయాన్ని నడకకు కేటాయించి ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో కనిపించిన దృశ్యాలివి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

జగనన్నకు చెబుదాం అర్జీలపై ప్రత్యేక దృష్టి



అర్జీదారులతో మాట్లాడుతున్న అధికారులు

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): జగనన్నకు చెబుదాంలో వచ్చే అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశించారు. నెల్లూరు కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో సోమవారం స్థానిక కలెక్టర్, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో ఎస్.లవన్న, ట్రెయినీ కలెక్టర్ సంజనా సింహా, జెడ్పీ డిప్యూటీ సీఈఓ చిరంజీవి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. సమస్య పరిష్కారం కాకపోతే కారణాలను అర్జీదారులకు వివరించాలన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం పక్కాగా అమలయ్యేలా చూడాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యాకసిరి ఫణిరాజు వినతిపత్రం సమర్పించారు. దివ్యాంగులకు సంబంధించిన పోస్టుల విషయమై ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు టి.శివప్రసాద్ కలెక్టర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, డీపీఓ సుస్మిత, డీఎంహెచ్ఓ పెంచలయ్య, హౌసింగ్ పీడీ నాగరాజు, డీఈఓ గంగా భవాని, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, మెప్మా పీడీ రవీంద్ర, డీసీహెచ్ఎస్ డాక్టర్ రమేష్ నాథ్, జేడీ సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 133
లేయర్ (లైవ్)	: 85
బ్రాయిలర్ చికెన్	: 236
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 262
లేయర్ చికెన్	: 145

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.63
సన్నవి	: రూ.50
పండ్లు	: రూ.25

29 లోపు రిజిస్ట్రేషన్ పత్రాలు తీసుకోవాలి



సమావేశం నిర్వహిస్తున్న కార్మిక శాఖ అధికారులు

నెల్లూరు(సెంట్రల్): ఆంధ్రప్రదేశ్ దుకాణాల సంస్థల చట్టం 1988 ప్రకారం దుకాణాల యజమానులు రిజిస్ట్రేషన్ పత్రాలను ఈనెల 29వ తేదీలోగా తప్పనిసరిగా తీసుకోవాలని ఉప కార్మిక కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. నెల్లూరులోని తన కార్యాలయంలో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుకాణాలు, వాణిజ్య సంస్థలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలన్నారు. సమావేశంలో అధికారులు కె.రామారావు, ఐ.వెంకటేశ్వర్లు, ఎస్.శ్రీనివాస్, పి.అనిల్‌కుమార్, ఇంకా లక్ష్మీనారాయణ, టీవీ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

పాతకక్షలతో వ్యక్తిపై హత్యాయత్నం

నెల్లూరు(క్రైమ్): పాతకక్షలతో ఓ వ్యక్తిపై కొందరు కత్తులతో విచక్షణారహితంగా దాడి చేసిన ఘటన నెల్లూరు మెక్లిన్స్ రోడ్డు సమీపంలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. పరమేశ్వరి నగర్‌కు చెందిన షేక్ జాకీర్ అలియాస్ జక్కా బంగారు లైన్ బిజినెస్ చేస్తుంటాడు. జెండా వీధిలోని జవహర్ భారతి స్కూల్ సమీప ప్రాంతానికి చెందిన వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నాడు. జాకీర్, ముజామిల్ బాడీబిల్డర్లు. సుమారు నాలుగేళ్ల క్రితం జిమ్‌లో వారి మధ్య ఘర్షణ జరిగింది. అప్పటి నుంచి ముజామిల్ అతడిపై కక్ష పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం అర్ధరాత్రి జాకీర్, తన అల్లుడైన సోహైల్‌తో కలిసి జెండా వీధి నుంచి మోటార్‌బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. మెక్లిన్స్ రోడ్డులోని ఓ దుకాణంలో పాలు, పెరుగు ప్యాకెట్లు తీసుకెళ్తుండగా ముజామిల్, అతని స్నేహితులు వారిని అడ్డగించారు. కత్తులతో జాకీర్‌పై విచక్షణారహితంగా దాడి చేశారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన సోహైల్‌ను తీవ్రంగా కొట్టారు. జాకీర్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. దీంతో అతను చనిపోయాడని భావించిన నిందితులు పరారయ్యారు. జాకీర్‌ను నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ అశోక్ తన సిబ్బందితో కలిసి ఆస్పత్రికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. సోహైల్ ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేశారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలిస్తున్నారు.

మిస్సింగ్ ఫిర్యాదులపై తక్షణమే కేసులు



బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ

- ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): 'మిస్సింగ్ ఫిర్యాదులపై తక్షణమే స్పందించి కేసు నమోదు చేయాలి. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా తప్పిపోయిన వారిని గుర్తించి కుటుంబసభ్యుల చెంతకు చేర్చాలి' అని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి ఆదేశించారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్లో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. మిస్సింగ్ ఫిర్యాదులపై కేసులు నమోదు చేయడం లేదని, ఉద్యోగాల పేరిట మోసగించారని, నకిలీ ధ్రువీకరణపత్రాలు సృష్టించి ఆస్తులు ఆక్రమించారని, అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని, దొంగతనం కేసుల్లో రికవరీ చేయలేదని తదితర వాటిపై 115 మంది నుంచి ఎస్పీకి ఫిర్యాదులు అందాయి. వాటిని పరిశీలించిన ఆయన ఆయా ప్రాంత పోలీసు అధికారులతో మాట్లాడి చట్టపరిధిలో నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాల పేరుతో పలువురు మోసాలకు పాల్పడుతున్నారని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ఫిర్యాదుదారులకు భోజనాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, ప్రసాద్, నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి, ఎస్బీ, ఎన్నికల సెల్ ఇన్‌స్పెక్టర్లు కె.రామకృష్ణారెడ్డి, షఫీ, ఎం.నాగేశ్వరమ్మ, ఎస్సై సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఒకేషనల్ ప్రాక్టికల్స్

నెల్లూరు(టౌన్): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ఒకేషనల్ విద్యార్థులకు సోమవారం జిల్లా వ్యాప్తంగా 8 కేంద్రాల్లో ప్రాక్టికల్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం జరిగిన ప్రాక్టికల్స్‌కు మొత్తం 379 మందికి గానూ 304 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ప్రాక్టికల్స్‌కు 382 మందికి గానూ 336 మంది హాజరయ్యారు. నెల్లూరు బీవీనగర్‌లోని సిద్ధార్థ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ప్రాక్టికల్స్‌ను ఆర్ఐఓ శ్రీనివాసులు తనిఖీ చేశారు.



విద్యార్థుల వివరాలు పరిశీలిస్తున్న ఆర్ఐఓ శ్రీనివాసులు